క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మొగల్తూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బుడగ జంగాల కులస్తులు

మొగల్తూరు: బేడ, బుడగ,జలగల కులస్తులను షెడ్యూల్ కులాల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడి విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు,కుమారి నాంచారయ్య, వైరింగం నాంచారమ్మ, కుమారి దుర్గారావు, లక్ష్మీ, రాందాసు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నాగమణి, ఏసు, పిచ్చియ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



లిఖితపూడి గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ప్రజా ప్రతినిధులు

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో గురువారం కిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ పోతురాజు వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు గ్రామానికి చెందిన సుమారు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కంట పరీక్షలు నిర్వహించిన వారిలో 20 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సిన అవసరం గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద పోతురాజు చిట్టిబాబు, మాజీ సర్పంచ్ చొప్పల సూర్యప్రకాష్ తదితరులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన లిఖితపూడి గ్రామానికి వచ్చి కిమ్స్ వైద్యులు సేవలందించడం చాల సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వర్దనపు మణిరత్నంరాజు, పితాని ముశీకృష్ణ, వీరవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కష్టపడితే జీవితమంతా విజయాలే

నరసాపురం: ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని విద్యార్థి దశలోనే ఆ లక్ష్యం చేరుకునే విధంగా కష్టపడితే జీవితమంతా విజయాలు వెంట వస్తాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ చదువు, ఉపాధి విషయంలో పూర్వపు రోజులు మారాయన్నారు. కష్టపడి చదివిన వారికి మంచి మంచి ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. సూర్యా కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, వైఎస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



ప్రార్థనల్లో ప్రసంగిస్తున్న పాస్టర్ సువర్ణరాజు

పోడూరు: జిన్నూరు పెదపేటలోని యెహోవా నిస్సీ ప్రార్థనా మందిరంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో బ్రదర్ షాలేమ్‌రాజు సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ దేవుని మార్గంలో నడుచుకోవాలని ఆయన విశ్వాసులకు పిలుపునిచ్చారు. చర్చి పాస్టర్ సువర్ణరాజు, వడ్డి రవికుమార్, పీతల అజయ్, పీతల రవి, పైడి ఎఫ్రేన్, రొక్కాల షాలేమ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగాభవానికి సన్మానం



కేపీ పాలెంలో గంగా భవానిని సన్మానిస్తున్న నాయకులు

మొగల్తూరు: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా కేపీ పాలెం నార్త్‌కు చెందిన కడలి గంగా భవానీని ఎన్నుకోవడంపై వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ మాట్లాడుతూ గంగా భవానీ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముక్కు దుర్గారావు, బెల్లంకొండ గిరి, డీఎస్వీ సత్యనారాయణ, డీవీవీ సత్యనారాయణ, యడ్ల మోసేస్, ముచ్చల శుక్లాచార్యులు, బొక్కా రాధాకృష్ణ, దొంగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుగొండ: దివ్యాంగులకు మోటర్ సైకిళ్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. గురువారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద దివ్యాంగులకు మోటారుసైకిళ్లు పంపిణీ చేశారు. అన్ని వర్గాలకు సంక్షేమం అందించడంతో పాటు, దివ్యాంగులకు ప్రత్యేక దృష్టితో సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. వారికి అండగా ఉండడంతో పాటు, ఉపాధి అవకాశాలు ఏర్పరచే విధంగా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. గతంలో కేవలం ట్రైసైకిళ్లు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకునేవారన్నారు. నేడు మోటారు సైకిళ్లు సైతం పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే ఎలాంటి పైరవీలు లేకుండా పారదర్శకంగా అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను. మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, ఎంపీటీసీ సభ్యులు తాడి సుబ్బిరెడ్డి, పెచ్చెట్టి లలిత, గుత్తుల సత్యవతి, మద్దిశెట్టి లక్ష్మీ, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వరరెడ్డి, నౌడు దుర్గారావు, గాజుల బులి పుల్లారావు, మేడపాటి చిరంజీవి రెడ్డి, నేలపూడి లక్ష్మణరావు, తిక్కిరెడ్డి పవన్, నడిపూడి సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట మండలం శెట్టి కరుగోరుమిల్లిలోని శెట్టి బలిజపాలెంలోని రామాలయానికి రూ.10లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా శెట్టి బలిజ సంఘ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం తూర్పుపాలెంలో కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరంగనాథరాజును కలిసిన ఆర్టీఓ

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును భీమవరం ఆర్టీఓ ఎం.రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. వాహన దారులను ఇబ్బందులు పెట్టకుండా విధులు నిర్వహించుకోవాలని సూచించారు.

శ్రీనివాస్ మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు



పెనుమంట్ర : మార్టేరులో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సీనియర్ యూత్ నాయకుడు, మార్టేరు గ్రామ పంచాయితీ 9వ వార్డు సభ్యుడు పత్తికాయల శ్రీనివాస్(47) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విచారం వ్యక్తం చేశారు. బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ముందుగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ మృతిపై జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్ మట్టా కుమారి రాము, ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ జోగిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు, ఆగర్తిపాలెం 33/11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా లంకలకోడేరు, సత్యనారాయణపురం, దగ్గులూరు, బల్లిపాడు, పాలమూరు, శివదేవునిచిక్కాల, గవరపేట, వెంకటాపురం, అరట్లకట్ట, కమ్ముల ప్రాంతాల్లోనూ, అలాగే ఆగర్తిపాలెం, ఆగర్రు, గోరింటాడ, మైజారుగుంట, సగంచెరువు, గొల్లగూడెం, వెలివెల, తిల్లపూడి, తిల్లపూడిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోడూరులో..

పోడూరు: పెనుమదంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 33కేవీ ఫీడర్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన పెనుమదం, గుమ్మలూరు, రావిపాడు, పైడావ గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ బి.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

యలమంచిలిలో..

యలమంచిలి: యలమంచిలి, ఇలపకుర్రు, కాజ 33 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల లైన్లు మరమ్మతుల నిమిత్తం ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



పాలకొల్లు అర్బన్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు



నరసాపురం రూరల్: చిట్టవరంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకునే విధంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పట్టణంలోని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షా, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఇన్సూరెన్స్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణంలోని డీఎన్నార్ మహిళా డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 30న, అలాగే అక్టోబర్ 13న ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో గుండె, ఎముకలు, దంత, కంటి, ఇతర వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షించి రోగులకు అవసరమైన వైద్య సలహాలు అందిస్తారన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కార్పొరేట్ ఆసుపత్రులో వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి అయా గ్రామాల్లో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడానికి కృషి చేయాలన్నారు. అలాగే గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఇన్సూరెన్స్ నమోదుకు సంబంధించి సంబంధిత ఫారాలను అందించాలని సూచించారు. పట్టణ సచివాలయ కన్వీనర్లు ఎంఎస్ వాసు, మోర్త గిరీష్, 31వ వార్డులకు సంబంధించి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

లంకలకోడేరులో..

ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30 వరకూ ప్రతీ గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్షా పథకంపై ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ తెలిపారు. గురువారం లంకలకోడేరు పీహెచ్‌సీ వద్ద ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ ఒక టీమ్, తహసీల్దార్ మరో టీమ్‌గా ఏర్పడి వైద్య సేవలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పలు రోగాలతో బాధపడుతున్న వారి వివరాలను ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు సర్వే చేశారన్నారు. సర్వే ప్రకారం పలు రోగాలతో బాధపడుతున్నవారు ఆయా శిబిరాలకు వచ్చి వైద్య సేవలు పొందే విధంగా ఏఎన్ఎం, ఆశ వర్కర్, ఆరోగ్య సిబ్బంది సహకరించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మాసిస్టు పీవీ స్వామి, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమశేశ్వరరావు, జి.ఉదయ్ చందర్, సత్తిబాబు, డి.కమల తదితరులు పాల్గొన్నారు.

చిట్టవరంలో..

నరసాపురం రూరల్: ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని యలమంచిలి పీహెచ్‌సీ డాక్టర్ స్వరూప్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంద్వారా ప్రతీ ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తామన్నారు. చిట్టవరం గ్రామ సచివాలయం వద్ద ఈ నెల 30న జరగనున్న వైద్య శిబిరానికి సంబంధించి ఇప్పటికే 15 రోజులుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సర్వే చేశారన్నారు. ఈ సర్వేలో భాగంగా బీపీ, సుగర్, యూరిన్, కళ్లె పరీక్ష తదితర 7 రకాల వైద్య పరీక్షలను నిర్వహించామన్నారు. 30న నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నవ్యశ్రీ, ఏఎన్ఎం చంద్ర కుమారి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు మెడ చుట్టూ అవినీతి కేసులు

పాలకొల్లు అర్బన్: ప్రజాధనాన్ని కొల్లగొట్టిన చంద్రబాబు మెడచుట్టూ అవినీతి కేసుల ఉచ్చు బిగిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రింగ్‌రోడ్డు కేసులో ఏ 14 ముద్దాయిగా నారా లోకేష్‌ను పోలీసులు నమోదు చేశారన్నారు. కేసులకు భయపడి లోకేష్ న్యూఢిల్లీలో దాక్కున్నారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 52 నెలల పాలనలో 14 నెలలు కోవిడ్ కారణంగా తీవ్ర ఆర్థిక సంక్షోభం ఏర్పడినా ఇచ్చిన హామీలు నెరవేర్చారని పేర్కొన్నారు. స్కామ్‌ల్లో ఇరుక్కున్న చంద్రబాబును అరెస్ట్ చేస్తే తెలుగు తమ్ముళ్లు అల్లర్లు చేయడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ నాయకులు దేవ రాజేష్‌కుమార్, పాలపర్తి కృపనాథ్, బావన సునీల్, సాలా శ్రీను, ఇంజేటి వరప్రసాద్, వడ్డి సత్య ప్రసాద్, వడ్డి సంజీవ్‌కుమార్, బద్దా శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గణపతిబప్పా మోరియా..!



నరసాపురం రూరల్: చిట్టవరంలో జేసీబీపై వినాయక ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



మొగల్తూరు: వర్ధమానవారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

- గ్రామాల్లో ఉత్సాహంగా నిమజ్జనాలు
- ఆకట్టుకున్న వేషధారణలు

నరసాపురం రూరల్: గ్రామాల్లో నిమజ్జనోత్సవాల సందడి నెలకొంది. గురువారం లక్ష్మణేశ్వరం, వేములదీవి, కొప్పర్రు, సీతారామపురం తదితర గ్రామాల్లో భారీగా వినాయకుడిని ట్రాక్టర్లపై పుర వీధుల్లో ఊరేగించడంతో పాటు మేళతాళాలతో, బాణసంచా కాలుస్తూ జై గణేష్, జైజై గణేష్ అంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. తీన్‌మార్ నృత్యాలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. మండలంలోని చిట్టవరం గ్రామంలోని మదనగోపాలస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేషుని ప్రతిమను విన్నూత్నంగా జేసీబీ వాహనంపై ఉంచి ఊరేగింపుగా నరసాపురం వశిష్ట గోదావరిలో నిమజ్జనానికి తీసుకెళ్లారు. విన్నూత్నంగా జరిగిన ఈ జేసీబీపై ఊరేగుతున్న విఘ్నేశ్వరుని వెంట సుమారు 15 కార్లలో భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో విస్సా వెంకటేష్, బుజ్జి, పైడికొండల కృష్ణ, చల్లా భాస్కర్, వడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. స్థానిక వర్ధమానివారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆంజనేయస్వామి ఎగురతుండగా కూడిన రథంలో వినాయకున్ని ఊరేగించారు. తీన్‌మార్ డప్పులతో, యువకుల నృత్యాలతో, బాణసంచా కాల్పులతో గ్రామంలోని ప్రధాన వీదుల్లో ఊరేగించి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

పాలకొల్లులో...


పాలకొల్లు సెంట్రల్: గణపతి ఉత్సవాల్లో సందర్భంగా గురువారం గణనాథులను నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కొన్ని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక మారుతి సెంటర్ రోడ్డు వద్ద చిన్నారుల కోలాటంతో గణనాథుడిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి కాలువలో నిమజ్జనం చేశారు. అలాగే పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటుచేసిన గణనాథులను పట్టణంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి సాయిబాబా ఆలయం వద్ద, బ్రాడీపేట బైపాస్ రోడ్డు వద్ద నరసాపురం, నిడదవోలు కాలువలో నిమజ్జనం చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం గణపతి నిమజ్జనోత్సవాలు, అన్నసమారాధనలు జరిపారు. వెలగలవారిపాలెం రామాలయం వద్ద రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి మండపం వద్ద అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. నెగ్గిపూడి శివాలయం సెంటర్‌లో చించినాడ కాలువగట్టు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం కాలువలో నిమజ్జనం చేశారు.



పాలకొల్లు సెంట్రల్: చిన్నారుల కోలాటంతో పల్లకిలో నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుడు



పెనుమంట్ర: వెలగలవారిపాలెంలో అఖండ అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

జిల్లా కలెక్టర్‌కు తూర్పుకాపు సంఘం కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఓబీసీ సమస్యపై జిల్లాలో తూర్పు కాపు సంఘ సభ్యులు ఎప్పటి నుంచో ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా కలెక్టర్ చొరవతో ఆ సమస్య నేటితో పరిష్కారమైందని తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం అధ్యక్షులు లోపింటి చిరంజీవి తెలిపారు. గురువారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 2020లో అప్పటి జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఓబిసి మాన్యువల్ ఇచ్చేలా ఆర్‌ఓసి ఏర్పాటు చేశారన్నారు. దానికి అనుగుణంగా నేడు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి నూతనంగా ఆర్‌ఓసీ ఇవ్వడంతో మైగ్రేషన్ ద్వారా ఓబీసీ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో తీసుకునే వెసులుబాటు కల్పించారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఓబీసీ విషయంలో సమతమతమవుతున్న తూర్పు కాపు విద్యార్థులు, నిరుద్యోగులకు ప్రస్తుతం ఆ సమస్య పరిష్కారమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతికి తమ తూర్పుకాపు సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కర్నేని గౌరునాయుడు, జమ్ము ముత్యం, మీసాల రాము, బాకూరి నిరంజన్, కరుమొజ్జు సత్యనారాయణ, పొట్నూరి శ్రీనివాసు, వాకాడ అప్పారావు, దనాని సూర్యప్రకాష్, యడ్ల సత్యనారాయణ, పిల్లా సత్తిబాబు, చీరా సత్తిబాబు, జమ్ము కాశి, దనాని శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

పోడూరు: వర్షాభావం, అధిక వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కవిటం గ్రామంలో జిల్లా రైతాంగ శిక్షణా తరగతులు నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ స్వామినాథన్ నివేదిక ప్రకారం వరి పంటకు మద్దతు ధర అమలు జరపాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ గత రబీ సీజన్‌లోని ఇబ్బందులను గమనించి ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయానికి ముందుగానే సంచులు, బరకాలు తదితర సదుపాయాలు సమకూర్చాలన్నారు. కొబ్బరి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. సభలో జిల్లా అధ్యక్షులు చింతకాయల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, పెనుగొండ, యలమంచిలి మండలాల ప్రాంతాల వారీగా ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి శుక్రవారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. బస్సు సౌకర్యాలు, ఇబ్బందులు, ఆర్టీసీ కార్గో సేవలపై ఎలాంటి ఇబ్బందులు, సూచనలు ఉంటే తెలియజేయాలని చెప్పారు.

డీఎన్నార్ కళాశాలకు నాక్ బీ డబుల్ ప్లస్ గ్రేడ్

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాల అయిన దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నాక్‌కు ఎంపికైనట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ నెల 20, 21లో జరిగిన నాక్ కమిటీ పర్యవేక్షణలో తమ కళాశాలకు బి డబుల్ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు తెలిపారు. తమ కళాశాల నాక్‌కు ఎంపికవడానికి సహకరించిన ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోల భాస్కర్‌కు, పట్టణ ప్రముఖులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు, పూర్వ విద్యార్థులు, సీపీడీసీ సభ్యులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు చీఫ్ విప్ ముదునూరి పర్యటన ఇలా

నరసాపురం: అసెంబ్లీ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు గురువారం పట్టణానికి చేరుకున్నారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలో అందుబాటులో ఉంటారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. ఉదయం ఆరు గంటలకు పట్టణంలోని 3వ వార్డులో జరిగే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. రూ.13.61 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.19 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్‌ను ప్రారంభిస్తారు. ఉదయం 10.30 గంటలకు అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించే 5వ విడత వాహనమిత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు.